క్లుప్తంగా

బక్రీద్ శుభాకాంక్షలు



మాచర్ల: ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకునే బక్రీదును అల్లా ఆశీస్సులతో జరుపుకోవాలని, ప్రతి ఒక్క ముస్లిం సుఖ సంతోషాలతో ప్రత్యేక ప్రార్థనలు చేసుకోవాలని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అల్లాను వేడుకొంటూ పెద్దల పండుగగా జరుపుకుని బక్రీద్ ఈద్ ముబారక్‌ను ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకుని అల్లా ఆశీస్సులు పొందాలని ప్రభుత్వ విప్ పీఆర్కే ముస్లింలందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

కాటేరువాగులో పూడికతీత పనులు



దాచేపల్లి : కాటేరువాగులో పూడికతీత పనులను బుధవారం ప్రారంభించారు. వర్షం కాలంలో ఈ వాగు పొంగి ప్రవహించడం వల్ల దాచేపల్లికి ప్రమాదకరంగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఈ వాగును ఆధునికీకరణ పనులు చేయించారు. వర్షాకాలం రావడంతో భారీ వర్షాలు కురిస్తే ఈ వాగు నుంచి దాచేపల్లి పట్టణ ప్రజలకు ఆస్తి నష్టం జరగకుండా జెసిబితో పూడిక తీయిస్తున్నారు. నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య పర్యవేక్షణలో పూడికతీత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పూడికతీత వలన వాగులో నీరు ఉధృతంగా ప్రవహించిన పట్టణంలోకి రాకుండా నేరుగా నాగులేరులో కలుస్తాయి.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కారెంపూడి: స్థానిక మోడల్ స్కూల్లో 7, 8, 9వ తరగతుల్లో ఉన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ నయోమి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల రెండవ తేదీలోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న వారిని ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చే నెల 4వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

తీరిన విద్యార్థుల వెతలు



గురజాల : విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని ఆర్టీసి అధికారులు సర్వీసును ప్రారంభించారు. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామం నుంచి మండల కేంద్రం గురజాలకు సుమారుగా ఉదయం వేళ వంద మందికి పైగా విద్యార్థులు పల్లెగుంత మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ, ఇంటర్మీడియట్, విద్యనభ్యసించేందుకు వస్తుంటారు. గ్రామంలో ఆటోలు అందుబాటులో లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. వైఎస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య దృష్టికి విద్యార్థుల పడుతున్న సమస్యను దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆర్టీసి అధికారులతో మాట్లాడి విద్యార్థుల కోసం ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించారు. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

టైఫాయిడ్ టీకా శిబిరం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం హరిజనవాడ కాలనీ నందు దాతల సహకారంతో ఉచిత టైఫాయిడ్ టీకా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వివేకనంద పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు బొల్లాపల్లి మండల ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజరు సంద్రపాటి చలపతిరావు వెల్లడించారు. బుధవారం ఎస్సీ కాలనీ ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో ప్రారంభించారు. 70 మంది విద్యార్థులకు టీకా వేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.పరమేశ్వరరావు, గన్నవరపు శ్రీనివాసరావు, రవిచంద్ర, ఉపాధ్యాయులు జగదీష్, శ్రీనివాసరావు, కాలనీలో యువకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి

యడ్లపాడు: అర్హులైన వారికి ప్రభుత్వం సంక్షేమ ఫలాల్ని వందశాతం అందించాలనే లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని ఎంపీడీవో వై హనుమారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యల్ని గుర్తించే ప్రక్రియను వేగంగా చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రజలు తమకు అర్హత ఉండి ఏదైనా సంక్షేమ పథకం రానివారు వలంటీర్‌ల దృష్టికి తేవాలన్నారు. ఆయా సంక్షేమ పథకాలను పొందేందుకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వీటికి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: త్వరలోనే జానపడు రూపురేఖలు మారబోతున్నాయని ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అన్నారు. మండలంలోని జానపాడు గ్రామంలో బుధవారం మూడవరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కార్యక్రమానికి హాజరు కావడంతో గ్రామ ప్రజలు, వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో హాజరై ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి నాలుగేళ్ల కాలంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును అంకెలతో సహా వివరించారు. నవరత్నాల ద్వారా ఆయా కుటుంబాలకు ఏఏ సంక్షేమ పథకాలు వచ్చాయి, వాటి ద్వారా ఎంత మేర లబ్ధి చేకూరిందో వారికి తెలియజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్‌లేట్‌ను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే జగనన్న సురక్ష పథకం ద్వారా మీ సమస్యను పరిష్కరించడం జరుగుతుందని ఆయన లబ్ధిదారులకు తెలియజేశారు.

మంచి చేస్తుంటే ఓర్వలేక కుట్రలు...

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుంటే ప్రతి పక్ష టీడీపీ ఓర్వలేక కుట్ర రాజకీయాలు చేస్తోందని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన ఏడాది వ్యవధిలోనే 90 శాతం పైగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. ఏ పథకం అమలు చేసినా తేదీల్లోనే లబ్ధిదారులకు అందజేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలా జన్మభూమి కమిటీల పేరుతో కాలయాపన లేదని, అవినీతికి తావు లేదని అర్హతే ప్రామాణికంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరిందని ఆయన తెలియజేశారు.

మీ ఆశీర్వాదం కావాలి తల్లి...

గతంలో ఎన్నో ప్రభుత్వాలను చూశారు...నాగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఒక్కొక్క కుటుంబానికి లక్షలల్లో లబ్ధి చేకూరిందా..రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు ఎలా వస్తున్నాయో మీరే ఆలోచించాలని తల్లి... ఇంతటి మేలు చేసిన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడైనా చూశారా తల్లి, అలాంటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీ ఆశీర్వాదం కావాలి తల్లి అంటూ ప్రతి ఇంటా ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి అడిగారు.

అభివృద్ధి బాటలో జానపాడు...

జానపాడు పిడుగురాళ్ల పట్టణానికి సమీపంలో ఉంది అంతేకాకుండా జానపాడు గ్రామం గురజాల నియోజకవర్గంలోని పెద్ద గ్రామం, గ్రామంలో పది వేల ఓటర్లతోపాటు సుమారు 14 వేల మంది జనాభా నివసించే గ్రామం ఇంత పెద్దటి గ్రామాన్ని అభివృద్ధి చేసే అవకాశం తనకు అవకాశం లభించిందన్నారు. రానున్న రెండేళ్లల్లో జానపాడు శరవేగంగా అభివృద్ధి దూసుకుపోతుందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, గ్రామ సర్పంచ్ గడిపూడి వెంకట రమణ, ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి, నాయకులు గడిపూడి పుల్లయ్య, మాజీ సర్పంచ్ తాళ్లపోగు మర్యాద రావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఉన్నం నరసింహారావు, డాక్టర్ ఉన్నం నాగమల్లి ఖార్జున రావు, సొసైటీ అధ్యక్షులు ఉన్నం శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీపీ సాతులూరి బాబు, గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ గఫార్, ఎంపీటీసీలు మన్నెం శ్రీనివాసరావు, షేక్ బుడే, కొతారు నరసింహారావు, మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, మండల మైనార్టీ కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి, వైఎస్సార్ సీపీ నాయకులు, తహసీల్దార్ చక్రవర్తి, ఎంపీడీఓ కాశయ్య, పంచాయితీ సెక్రటరీ స్వామినాయక్, వీఆర్వోలు ప్రసాద్, సీతరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో ఇళ్ల పట్టాల పంపిణీ



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: 30 సంవత్సరాల్లో ఏ ప్రభుత్వం చేయలేనిదీ 30 రోజుల్లో పూర్తి చేసి ఇళ్లపట్టాల అందించిన ఘనత మన ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని జానపాడులో బుధవారం మూడవరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగేళ్ల కాలంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును అంకెలతో సహా వివరించారు. నవరత్నాల ద్వారా ఆయా కుటుంబాలకు ఏఏ సంక్షేమ పథకాలు వచ్చాయి, వాటి ద్వారా ఎంత మేర లబ్ధి చేకూరిందో వారికి తెలియజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల బుక్‌లేట్‌ను అందజేశారు. ఎస్సీ, బీసీ, మైనార్టీ కాలనీ నుంచే తాగునీరు మొదలుపెట్టి గ్రామంలోని ప్రతి ఇంటికి పైపులైన్ ద్వారా మంచినీటిని అందిస్తామని తెలియజేశారు. అలాగే గ్రామంలో రూ. 3.50 కోట్లతో సైడు కాలువలు, డ్రైనేజీని నిర్మించడం జరిగిందన్నారు. వందేళ్ల నుంచి సమస్యగా మారిన చాకిరేవు బ్రిడ్జి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ. 87 లక్షలతో చాకిరేవు బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ముస్లింలకు, కాపులకు షాదీఖానా, కాపు భవనం త్వరలోనే నిర్మిస్తామన్నారు. ఎస్సీలకు రెండు కమ్యూనిటీ హాల్స్ నిర్మాస్తామని తెలిపారు. ఎస్టీ కాలనీలో 70 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.

'ఓటు' హక్కుకు భంగం వాటిల్లకూడదు

ఈఆర్ఓ శ్రీరామచంద్రమూర్తి



మాట్లాడుతున్న ఆర్ఓ శ్రీరామచంద్రమూర్తి

కారెంపూడి: ప్రాథమిక హక్కు ఓటు హక్కుకు ఎలాంటి భంగం వాటిల్లకుండా బూత్ లెవల్ అధికారులు ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఖచ్చితమైన విధి నిర్వహణ చేయాలని ఎలాంటి అలసత్వం వహించినా దానికి వారే బాధ్యులు అవుతారని ఈఆర్ఓ ఎ శ్రీరామచంద్రమూర్తి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దుర్గి, కారెంపూడి మండలాల స్థాయి బూత్‌లెవల్ అధికారుల సమావేశాన్ని ఆర్ఓ బుధవారం నిర్వహించారు. అవకతవకలు లేకుండా ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగాలని,18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నమోదు చేయడం బూత్‌లెవల్ అధికారుల బాధ్యతన్నారు. అలాగే ఓట్ల తొలగింపు విషయంలో కూడా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పక పాటించాలని ఆదేశించారు. అవసరమైతే కాలేజీలకు వెళ్లి విద్యార్థులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా చైతన్యపర్చాలని సూచించారు. ఆధార్ కార్డులో పుట్టిన తేదీ ఆధారంగా కూడా ఓటు హక్కు కల్పించవచ్చన్నారు. ఓటు కోసం దరఖాస్తు చేసుకుంటే సరైన కారణం లేకుండా తిరస్కరణ కుదరదని, కారెంపూడిలోనే 130 దాకా దరకాస్తులు పెండింగ్‌లో ఎందుకున్నాయని ప్రశ్నించారు. బోగస్ ఓట్లను తొలగించాలని ఒకే ఇంటి నంబరుపై ఎక్కువ మంది ఓటర్లుగా నమోదై ఉంటే పరిశీలన చేసి నివేదికలివ్వాలని ఆదేశించారు. అలాగే బోగస్ ఓట్లను గుర్తించడం, రెండు మూడు చోట్ల ఓటు హక్కు ఉన్నవారిని వివరాలు సేకరించడం, అలాగే మృతుల వివరాలు సేకరించి సంబంధిత పై అధికారులకు నివేదికలివ్వాలని ఆదేశించారు. ఓటు హక్కుకు భంగం కలిగించే అధికారం ఎవరికీ లేదని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యంత్రాగం చాలా అప్రమత్తంగా విధి నిర్వహణ చేయాలని ఏ మాత్రం పొరపాట్లు జరిగినా దానికి సంబంధిత ఉద్యోగులే బాధ్యులు అవుతారని ఆర్ఓ హెచ్చరించారు. కారెంపూడి తహసీల్దార్ జి శ్రీనివాస్ బూత్ లెవల్ అధికారులకు వివిధ ప్రొఫార్మాల భర్తీ చేసే విషయమై అవగాహన కల్పించారు. జనాభా ఓటర్ల నిష్పత్తి ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, అలాగే పురుషుల మహిళల నిష్పత్తిని కూడా ఉండేలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆరోగ్యకరమైన స్వచ్ఛ ఎన్నికలే ప్రామాణికంగా క్షేత్ర స్థాయి సిబ్బంది పనితీరు ఉండాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ విధి నిర్వహణకు సంబంధించి ఎవరు విధి నిర్వహణ చేయకపోయినా క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటి నంబరు లేకుండా కారెంపూడిలో 202 మంది ఓటర్లున్నారని అలాగే ఒకే డోరు నంబరుపై పది కంటే ఎక్కువ ఓటర్లున్నారని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులను సవరించాలని, ఏ ఒక్కరు తమకు ఓటు రాలేదని ఫిర్యాదులు రాకూడదన్నారు. ముఖ్యంగా కనీసం నీడ లేకుండా ఏదో ఒక చోట తలదాచుకుని బతుకుతున్న బడుగులు, సంచార జాతులు, చెంచులు ఇతర గిరిజనులందరికి ఓటు హక్కు ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారని తహసీల్దార్ పేర్కొన్నారు. సమావేశంలో దుర్గి తహసీల్దార్ జి రమేష్,డీటీ కీర్తి సుధాస్రవంతి రెండు మండలాలకు చెందిన బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ చేస్తున్నాం

మాచవరం: మండలంలో ఓటర్ల తుది జాబితా సిద్ధం కాలేదని, ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు జనవరి నాటికి నూతన జాబితా ప్రచురించాల్సి ఉందని, ప్రస్తుతం గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు ఓటర్ల జాబితా సవరణలు చేస్తున్నారని తహసీల్దారు ప్రసాద్ తెలిపారు. మండలంలో ఓటర్ల జాబితా అస్తవ్యస్తంగా ఉందంటూ ఓ దిన పత్రికలో వచ్చిన కథనంపై ఆయన పై విధంగా వివరణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన తప్పిదాలను సవరిస్తూ ఓటరు వరస సంఖ్య క్రమంలో ఉండే విధంగానూ, నూతన ఓటర్లు ఇంటి నంబర్ ఆధారంగా క్రమ సంఖ్యలో ఉండేటట్లు చూస్తున్నట్లు చెప్పారు. మరణించిన ఓటర్లను తొలగించేందుకు ఆయా కుటుంబ సభ్యులను నుంచి డిక్లరేషన్ ఫారం, లేదా మరణ ధృవీకరణ పత్రం తీసుకుని తొలగిస్తామన్నారు. మండలంలో వంద ఏళ్లు పైబడిన ఓటర్లు 12 మంది ఉన్నారని, వారి ఆధార్‌కార్డును అదారంగా వాటిని సవరించడం జరుగుతుందన్నారు. ఎలాంటి తప్పిదాలు లేకుండా తుది జాబితా ప్రచురించేలా చూస్తామని తెలిపారు.

అర్హులైన ప్రతి రైతుకు వైఎస్సార్ జలకళ బోరు



వెల్దుర్తి: వెనుకబడిన మండల మైన వెల్దుర్తిలో వైఎస్సార్ జలకళ పథకం కింద కండ్లకుంట గ్రామానికి 350 బోర్లు శాంక్షన్ అయినట్లు మూడు జిల్లాల కో ఆర్డినేటర్ పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కండ్లకుంట గ్రామంలో వైఎస్సార్ జలకళ బోరును ప్రారంభించి మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. వర్షాధారం పై పంటలు పండించే రైతులకు బోరు బావులు ఏర్పాటు చేసి ఆ బోర్లు ద్వారా పంటలు పండించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. రెండున్నర యకరాల భూమి ఉన్న రైతులకు ఒక్కో బోరు రూ. 4లక్షల విలువైన బోరు, మోటారు పైపులను పూర్తిగా ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. నియోజక వర్గంలో ఇప్పటికే 600ల బోర్లు మంజూరయ్యాయన్నారు. వివిధ గ్రామాల్లో బోర్లు వేస్తున్నారన్నారు. మాచర్ల నియోజక వర్గానికి ప్రత్యేకంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సీఎం జగన్‌తో మాట్లాడి మరో 1000 బోర్లు మంజూరు చేయించారన్నారు. అర్హులైన ప్రతి రైతుకు వైఎస్సార్ జలకళ ద్వారా బోర్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిన్నెల్లి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పిన్నెల్లి వెంకటలక్ష్మారెడ్డి, తంగిరాల శివారెడ్డి, ఈడెబోయిన వెంకయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో సేవలు అందించాలి

ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ చౌడేశ్వరి

రెంటచింతల: రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించాలనే ధృడసంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రజలకు అంకిత భావంతో సేవలు అందించాలని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. బుధవారం రెంటచింతల సచివాలయం -1 వద్ద రెంటచింతల, రెంటాల గ్రామాలకు చెందిన వలంటీర్లకు, గృహసారథులకు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని గడప గడపకు వెళ్లి అర్హత ఉండి సంక్షేమ పథకాలు పొందని వారిని గుర్తించి వారికి కూడా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకు సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అర్హత కలిగిన వందశాతం రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్నా దానిని పరిష్కరించడానికి ఇంటికి పెద్ద కొడుకులా సీఎం జగన్ చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి కొనసాగింపుగా ఈ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారన్నారు. తహసీల్దారు కె.పుల్లారావు మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్ర ప్రజలకు ఉచితంగా జనన, మరణ, కుల, సీసీ ఆర్సీ, రేషన్ కార్డులు, ఇన్‌కమ్ తదితర 11 రకాల సేవలను అందించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించడానికి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించారన్నారు. సదస్సులో సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య, ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కొత్తా నరసింహారెడ్డి, ఎంపీటీసీ గాలిప్రతాప్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఏరువ ప్రమీలా విజయభాస్కర్, వలంటీర్లు, సచివాలయాల మండల కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం



కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల రూరల్: నియోజక వర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమ, ఆర్థిక అభివృద్ధి కోసం నిధులను మంజూరు చేయటమే కాకుండా వారికి అన్ని విధాలా వ్యక్తిగతంగా అండదండగా ఉంటానని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొప్పునూరు గ్రామంలో బాప్టిస్టు చర్చి ప్రాంగణంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించే కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేసి ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసిల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ పయనిస్తున్న బాటలోనే తానూ నాలుగు అడుగులు ముందుకేసి లక్షలాది రూపాయల నిధులను మంజూరు చేయించి వారికి కమ్యూనిటీ హాల్స్, చర్చిలు, మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాల్వలను నిర్మించిన సంగతిని ఆయన తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలతో ఎన్నో పథకాలను తీసుకొచ్చి అన్నీ వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీకి మరో మారు ప్రజలందరూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం రూ. 15లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, సర్పంచ్ నోముల కృష్ణ, ఉపసర్పంచ్ కొప్పుల శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ తంగిరాల చెంచురెడ్డి, మాజీ సర్పంచ్ సాల్మన్‌రాజ్, మాజీ ఎంపీటీసీ బొనిగె ముత్తయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు హనిమిరెడ్డి, అంకిరెడ్డి, గుర్రపు చిన అంకాలు, జి చంద్రయ్య, కాటంరాజు, పాస్టర్ ఆలేటి సాల్మన్, జయరావు, పేరువాల రహీం, శివ, ఆనంద రావు తదితరులున్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్



పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాద్

మాచర్ల: పట్టణంలోని ఎస్‌కెబిఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో పీజి సెంటర్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని, కళాశాల అభివృద్ధికి పలు చర్యలు తీసుకుంటానని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. బుధవారం ఎస్‌కెబిఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ పాల్గొని మాట్లాడారు. హైకోర్టు న్యాయవాది సమీర్ కుమార్‌రెడ్డి అందజేసిన మైకులను డిగ్రీ, జూనియర్ కళాశాలలకు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కళాశాల విద్యార్థిగా ఉన్న పూర్వపు రోజుల్లో విద్యనభ్యసించి ఎదిగానన్నారు. అటువంటి కళాశాలకు తన వంతు సహాయ సహకారాలందించేందుకు కృషి చేస్తానన్నారు. పూర్వ విద్యార్థులు జి రామకృష్ణారావు, డా సుబ్బారావు, ప్రధానోపాధ్యాయులు శివారెడ్డి, గాదె కిరీటిరెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి, బొల్లయ్యలున్నారు. పూర్వ విద్యార్థులు డొక్కా మాణిక వరప్రసాద్‌ను సత్కరించారు.

నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు

దుర్గి: అసత్య ప్రకటనలు చేస్తూ బురదజల్లే వాఖ్యలు చేస్తే సహించే ప్రసక్తే లేదని దుర్గి మండల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. దుర్గిలో టీడీపీ నాయకులు మంగళవారం ఏర్పాటు చేసిన సభల్లో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పై చేసిన నిరాధార ఆరోపణలను తిప్పికొడుతూ బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజా ప్రతినిధులు పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి పాటుపడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న వ్యక్తి ప్రభుత్వ విప్ పీఆర్కే అని సంవత్సరానికో.. ఆర్నెల్లుకో ఒకసారి వచ్చి నిరాధారమైన ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ఎంపీపీ యేచూరి సాయి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో ఎటువంటి కుల, మత, రాజకీయాలు చూడకుండా అర్హతే ప్రాధాన్యతగా ఎంచి చూసి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఏకైక పార్టీ ఒక్క వైఎస్సార్ సీపీనే అన్నారు. ప్రభుత్వ విప్ పీఆర్కే పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో సీఎంగా జగన్, ఎమ్మెల్యేగా పీఆర్కేల విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, మండల పార్టీ కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయ్, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కటకం చిన వెంకటయ్య, యకటీల బుచ్చిబాబు, జంగా కొండలు, తోటకూర వెంకటేశ్వర్లు, కటకం గోపాల్, సర్పంచ్‌లు రాయపాటి మాణిక్యం, నలబోతు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు కటకం గోపాల్, షేక్ హుస్సేన్, శెట్టిపల్లి కోటేశ్వరరావు, రాయల మధు, పలువురు పార్టీ నాయకులు తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయండి

ఎంపీపీ ఏచూరి సునీత సాయిశంకర్



సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ ఏచూరి సునీత సాయిశంకర్

దుర్గి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా క్షేమాన్ని ఆకాంక్షిస్తూ ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని, వాటిని ప్రజలకు చేరువ చేసే బాధ్యత ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వ అధికారులకు ఉందన్నారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని ఎంపీపీ ఏచూరి సునీత సాయిశంకర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల మూలంగా గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడిందని తాగునీటి సమస్యకు స్థానిక సర్పంచ్‌లు, సెక్రెటరీలు బాధ్యత తీసుకుని సమస్యను పరిష్కరించాలన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ మాట్లాడుతూ మండల పరిధిలో 11 సచివాలయాలకు గాను నాలుగు పూర్తయ్యాయని 7 సచివాలయాలు నిర్మాణ చివరి దశలో ఉన్నాయని, వ్యవసాయ శాఖ ఏఓ అమీర్‌రెడ్డి మాట్లాడుతూ పత్తిపంట వేసే సమయం పూర్తికానున్న దృష్ట్యా, వర్షాభావం నెలకొన్న కారణంగా రైతులు కందిపంటను సాగుచేయాలని, ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ. 7వేలు ఉన్నందున కంది పంటకు సాగుకు అనుకూలంగా ఉందని సూచించారు. జెడ్పీటీసి శెట్టిపల్లి యలమంద మాట్లాడుతూ జెడ్పీహెచ్ఎస్ గ్రాంటును దుర్గి, ధర్మవరం గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తున్నామని రానున్న రోజుల్లో మిగిలిన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఎంపీడీఓ కె సమతావాణి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష పథకాన్ని అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు లబ్ధి పొందే విధంగా కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో ఏఓ శివప్రసాద్, ఈఓపీఆర్‌డి జీఎల్ఎన్ గుప్తా, సీనియర్ అసిస్టెంట్ ఎస్ రాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈ వెంకటేష్, ఎపిఓ జి వెంకటేశ్వర రావు, ఆర్టీసి సూపర్‌వైజర్ లాలునాయక్, వెటర్నరీ డాక్టర్ దిలీప్, హౌసింగ్ ఎఈ రాణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగేంద్రం, ఎంపీటీసిలు కటకం గోపాల్, బొంతా కృష్ణ, అరిగెల కొండలు, ఆంజనేయులు, సర్పంచ్‌లు గంగారపు వెంకటరెడ్డి, బీర్నిడి మాణిక్యరావు, రాయపాటి మాణిక్యం, పంచాయతీ సెక్రెటరీలు శివశంకర్, హఫీజుద్దీన్, వివిధ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

నరసరావుపేట ఈస్ట్: ప్రకాష్‌నగర్ శ్రీ సాయి క్షేత్రంకు చెందిన సాయిబాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం కనపర్రు గ్రామం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.10 వేలు విలువ చేసే నోట్ పుస్తకాలు, పలకలు, బాక్స్‌లు అందించారు. ట్రస్ట్ ప్రతినిధులు మురారిశెట్టి గోపాలబాబు, రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, రాఘవయ్య, శైలజ, పేరారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసినట్లు గోపాలబాబు తెలిపారు.